

పాఠశాల స్థలంలో..

ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య హెచ్చరించారు. 8లో▶



బందోబస్తు మధ్య ..

ఓ వివాదాస్పద స్థలంలో ఏర్పాటు చేసిన గుడిసెను శుక్రవారం పోలీసు బందోబస్తు మధ్య తొలగించారు. 8లో▶



హుండీ చోరీకి యత్నం

దుండగులు దర్గాలో హుండీ చోరీకి విఫల యత్నం చేసిన ఘటన ఇబ్రహీంపట్నం ఠాణా పరిధిలో వెలుగులోకి వచ్చింది. 8లో▶

పరిహారం మెరుగు!

ఫార్మా రైతులకు తీపి కబురు

- న్యాయం జరిగేలా సర్కార్ దృష్టి
- ఎకరాకు రూ.50 లక్షలలోపు పరిహారం, 121 గజాల ప్లాటు ఇచ్చేలా యోచన
- నాలుగేళ్ల నిరీక్షణకు తెర

యాచారం: ఫార్మా రైతులకు త్వరలో తీపి కబురు అందనుందా అంటే ఔననే సమాధానం వస్తోంది. బీఆర్ఎస్ సర్కార్ హయాంలో ఫార్మాసిటీకి పట్టా భూములు ఇవ్వడం లేదని మొండికేసిన రైతుల భూ రికార్డులను టీజీఐఐసీ పేరు మీద మార్చి, పరిహారాన్ని అథారిటీలో జమ చేసిన రైతులకు న్యాయం చేయడానికి కాంగ్రెస్ సర్కార్ దృష్టి సారించింది. టీజీఐఐసీ పేరు మీద మార్చేసిన భూ రికార్డులను తమ పేరిట మార్చాలని రైతులు హైకోర్టును ఆశ్రయించడం, కోర్టు సానుకూల ఉత్తర్వులు ఇవ్వడం తెలిసిందే. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు నిత్యం తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్, సీసీఎల్ఏ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. భూరికార్డుల మార్పుతో నాలుగేళ్లుగా బాధిత రైతులు రైతు బంధు, రైతు భరోసా, బ్యాంకు రుణాల మాఫీ కోల్పోవడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో విక్రయించుకుందామంటే అవకాశమే లేకుండా పోయింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైతులకు మద్దతుగా మాట్లాడిన కాంగ్రెస్ పెద్దలు అధికారంలోకి వచ్చాక స్పందించకపోవడంతో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో రైతుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది.

నాలుగేళ్లుగా బాధిత రైతుల చక్కర్లు

యాచారం మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో బీఆర్ఎస్ సర్కార్ హయాంలో ఫార్మాసిటీకి 9,851 ఎకరాల అసైన్డ్, పట్టా భూమిని సేకరించడానికి నిర్ణయించారు. అందులో భాగంగా 7,640 ఎకరాలు సేకరించారు. నిర్ణయించిన మేరకు పరిహారం అందజేశారు. ఆయా గ్రామాల్లో దాదాపు 1,500 మందికి పైగా రైతులకు చెందిన 2,211 ఎకరాల పట్టా భూమిని ఫార్మాకు ఇవ్వాలని అప్పట్లో అధికారులు తీవ్ర ఒత్తిళ్లు తెచ్చారు. రైతులు ససేమిరా అనడంతో రాత్రికిరాత్రే అవార్డులు పాస్ చేసి, పరిహారం డబ్బులను అథారిటీలో జమ చేశారు. కొన్ని రోజుల వ్యవధిలోనే భూ రికార్డులను టీజీఐఐసీ పేరు మీద మార్చేశారు. నాలుగేళ్లుగా ఆయా గ్రామాల రైతులు తమ పేర్ల మీద మార్చాలని అధికారులు, కోర్టుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది.

గతంలోకంటే మెరుగ్గా..

పట్టా రైతుల భూ రికార్డుల విషయం కోర్టు పరిధిలో ఉండడంతో అధికారులు సైతం ఏమీ చేయలేకపోయారు. విషయాన్ని కొద్దిరోజుల క్రితం రైతు కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. రైతులు భూమికి భూమి ఇచ్చినా పరవాలేదు అంటుండగా సర్కార్‌లోని పెద్దలు మాత్రం భూమికి భూమి ఇస్తే రాష్ట్రమంతా అదే సమస్య వస్తుందనే ఆలోచనతో ఉన్నట్టు సమాచారం. ఈ మేరకు గతంలో ఇచ్చిన దానికంటే మెరుగైన పరిహారం ఇప్పించి, మెప్పించేలా దృష్టి సారించినట్టు తెలిసింది. పట్టా భూములకు మొదట్లో ఎకరాకు రూ.12.50 లక్షలు, ఆ తర్వాత రూ.16 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పెంచి ఇచ్చారు. పరిహారంతో పాటు ఎకరా భూమికి 121 గజాల ప్లాటు ఇచ్చారు. ప్రస్తుతం ఎకరాకు రూ.50 లక్షలలోపు పరిహారం, ఎకరాకు 121 గజాల ప్లాటు ఇచ్చేలా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు సమాచారం. త్వరలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో రైతు కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి రైతులకు తీపి కబురు అందించనున్నట్టు తెలుస్తోంది.



నక్కర్తమేడిపల్లిలో టీజీఐఐసీ పేరు మీద మార్చేసిన పట్టా భూమి



❖ ఎప్పుడొస్తారో.. ఎప్పుడిస్తారో

ప్రతి నెల 1వ తేదీ నుంచి ఇవ్వాల్సిన పింఛన్లు పోస్టల్ సిబ్బంది నెలాఖరులో ఇస్తున్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్‌లో సుమారు 500 మందికి పైగా లబ్ధిదారులు ఉన్నారు. ఈ నెలలో ఇవ్వాల్సిన పింఛన్లు ఇప్పటి వరకు ఇవ్వలేదు. లబ్ధిదారులు నిత్యం మున్సిపల్ కార్యాలయానికి వచ్చి వెళ్తున్నారు. శుక్రవారం సైతం ఇలా రోజంతా పడిగాపులు కాశారు. సాయంత్రం వరకు కూడా పోస్టల్ సిబ్బంది రాకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

– మొయినాబాద్

న్యూస్‌రీల్

ఆ ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

కేశంపేట: మండల పరిధిలోని పాటిగడ్డ కేజీబీవీలో విధులు నిర్వర్తిస్తున్న ఏడుగురు ఉపాధ్యాయులకు జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు మండల విద్యాధికారి చంద్రశేఖర్ తెలిపారు. 'సాక్షి'లో ఈ నెల 21 'టీచర్లు ఫంక్షన్‌కి.. పాఠాలు గాలికి' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విధితమే. దీనికి స్పందించిన డీఈఓ సదరు ఉపాధ్యాయులకు నోటీసులు జారీ చేశారు. దీంతో వారు శుక్రవారం జిల్లా కార్యాలయానికి వెళ్లి వివరణ ఇచ్చారు.

ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్

తుర్కయంజాల్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరి హెల్మెట్ ధరించాలని మహేశ్వరం ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ అన్నారు. పురపాలక సంఘం పరిధి తుర్కయంజాల్‌లో శుక్రవారం సీఐ గురునాయుడుతో కలిసి వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే ప్రమాదాల బారిన పడ్డప్పుడు తలకు బలమైన గాయాలు తగిలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. హెల్మెట్ ఉంటే ప్రాణాలు కాపాడుకోవచ్చని చెప్పారు. అనంతరం హెల్మెట్ లేకుండా సాగర్ రహదారిపై ప్రయాణిస్తున్న వారికి చలాన్లకు బదులు కొత్త వాటిని కొనుగోలు చేయించారు. ఆయన వెంట ఎస్ఐ సాయినాథ్ ఉన్నారు.

సహకార సంఘాన్ని సందర్శించిన విద్యార్థులు



విద్యార్థుల బృందంతో డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య

తుర్కయంజాల్: ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ కోఆపరేషన్–2025ను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్‌లో ఇంటర్న్‌షిప్‌లో ఉన్న నిజాం కళాశాల, బేగంపేట్ డిగ్రీ కళాశాల విద్యార్థుల బృందం శుక్రవారం తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘాన్ని సందర్శించింది. సంఘం రైతుల కోసం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పని విధానాన్ని ఈ సందర్భంగా విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యను కలిసి పలు విషయాలపై చర్చించారు. కొహెడలోని గోదాములను పరిశీలించిన అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీసీఓ సుధాకర్, సహకార యూనియన్ ఫ్యాకల్టీ ఆర్.సురేఖా రాణి, వై.పరిమళా దేవి, బి.నాగేశ్వర రావు, సీఈఓ వై.రాందాసు పాల్గొన్నారు.

జిల్లా పశువైద్యాధికారిగా డాక్టర్ మధుసూదన్



సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారిగా డాక్టర్ మధుసూదన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన ఆర్‌జేడీ బాబు బేరిపై పలు ఆరోపణలు రావడం, ఉన్నతాధికారులు ఆయన్ను ఆ స్థానం నుంచి తప్పించి, ఆ స్థానంలో మధుసూదన్‌ను నియమించడం తెలిసింది. దీంతో ఆయన జిల్లా పశు వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడిపరిశ్రమ అభివృద్ధికి కోసం పాటు పడుతానని తెలిపారు. పశు వైద్య సిబ్బంది అంతా బాధ్యతగా పని చేయాలన్నారు.

బాబుబేరిపై చర్యలు తీసుకోవాలి

ఇప్పటి వరకు ఇక్కడ ఆర్‌జేడీగా పని చేసిన బాబుబేరిపై పలు అవినీతి ఆరోపణలు ఉన్నాయని, గొర్రెల పంపిణీ పథకంలో ఆయన అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయని, ఉద్దేశపూర్వకంగానే జిల్లా వైద్య సిబ్బందిపై పలు రకాల వేధింపులకు పాల్పడ్డాడని హైదర్‌గూడ పీవీసీ డాక్టర్ ఎంకే శ్రీకాంత్ తెలిపారు. ఈ మేరకు ఆయన సాక్షితో మాట్లాడారు. బాబు బేరి తనపై కక్షగట్టాడని, ఉద్దేశపూర్వకంగానే తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నాడని పేర్కొన్నారు. సరిపడా స్టాఫ్ లేకపోవడంతోనే టీకాలు సకాలంలో వేయలేకపోయినట్లు తెలిపారు. రిఫ్రిజిరేటర్‌లో భద్రపరిచిన వ్యాక్సిన్లను ఉద్దేశపూర్వకంగా సీజ్ చేసి, వాటిని పాడు చేయడమే కాకుండా ప్రభుత్వానికి నష్టం కలిగించిన ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉద్యమ కళాకారులను ఆదుకోవాలి

హయత్‌నగర్: తెలంగాణ ఉద్యమంలో కళాకారులు ముందుండి పోరాటం చేశారని, వారికి తగిన గుర్తింపు ఇచ్చి ఆదుకోవాలని ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ, జిల్లా ఇన్‌చార్జి ముత్యాల యాదిరెడ్డి అన్నారు. కుంట్లూరు రావినారాయణరెడ్డి కాలనీలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ప్రజానాట్యమండలి జిల్లా సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం సమగ్ర సాంస్కృతిక విధానాన్ని ప్రకటించాలని, కళాకారులకు గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు, పిల్లల చదువులకు ఫీజులో రాయితీ, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ నెల 30న జరిగే సదస్సులో కళాకారుల సమస్యలపై చర్చిస్తామని, తీర్మానాన్ని ఆమోదించి ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. జిల్లా సహాయ కార్యదర్శి రాము అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల కార్యదర్శి హరిసింగ్‌నాయక్, జిల్లా కార్యదర్శి వేణుగోపాలచారి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పల్లె నర్సింహ

చోరీ కేసుల్లో రికవరీ పెరగాలి

రాచకొండ సీపీ సుధీర్‌బాబు

ఇబ్రహీంపట్నం రూరల్: చోరీ కేసుల్లో సొత్తు రికవరీ శాతం పెరగాలని, ఆ దిశగా పనిలో వేగం పెంచాలని రాచకొండ పోలీస్‌కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశించారు. ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ నిర్వహణకు సంబంధించి సీఐ రాఘవేందర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. మాదక ద్రవ్యాల కేసులో సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేయాలని సూచించారు. ఎన్‌బీడబ్ల్యూ కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. కేసుల ఛేదన, రిసెప్షన్ నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. మహిళా కేసుల విచారణ వేగవంతం చేయాలని చెప్పారు. రౌడీషీట్ చెకింగ్, లాంగ్ పెండింగ్ కేసులు తేల్చాలని పేర్కొన్నారు. ఏడాది కాలంగా ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ నిర్వహణ బాగుందని, చోరీ కేసుల్లో జోన్ పరిధిలో మంచి ఫలితాలు సాధించారని కితాబిచ్చారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేయడంలో చొరవ బాగుందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం మరింతగా శ్రమించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు రాజు, వెంకటేశ్, బాల్‌రాజ్, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆదిబట్ల ఠాణాలో రికార్డులు పరిశీలిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

బోడకొండ గుట్టల సందర్శన

మంచాల: మండలంలోని బోడకొండ గుట్టలను శుక్రవారం రాచకొండ సీపీ సుధీర్‌బాబు సందర్శించారు. వాటర్‌ఫాల్స్‌ను పరిశీలించి స్థానిక పోలీసులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాటర్‌ఫాల్స్ పూర్తిగా బండరాళ్లతో కూడి ఉందని, ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా ప్రాణాలకు ప్రమాదమని అన్నారు. ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అవసరమైతే పికెటింగ్ ఏర్పాటు చేసి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, మంచాల సీఐ మధు, ఎస్ఐ లాలయ్య తదితరులు ఉన్నారు.



భూములను పరిశీలిస్తున్న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి శ్రీదేవి, ఎఫ్‌సీడీఏ కమిషనర్ శశాంక

ఫ్యూచర్‌సిటీలోకి మరో ప్రభుత్వరంగ సంస్థ

భూములను పరిశీలించిన అధికారులు

కందుకూరు: ఫ్యూచర్‌సిటీలోకి మరో ప్రభుత్వరంగ సంస్థ రాబోతోంది. ఈ మేరకు అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో స్థల పరిశీలన చేపట్టారు. మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట రెవెన్యూ సర్వే నంబర్ 119, 120లో టీజీఐఐసీ సేకరించి ఫ్యూచర్‌సిటీకి కేటాయించిన భూముల్లోని 20 ఎకరాల్లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి శ్రీదేవి, ఎఫ్‌సీడీఏ కమిషనర్ శశాంక సదరు సర్వే నంబర్లలోని భూములను పరిశీలించారు. రెండు ప్రదేశాల్లో ఏదో ఒకదాన్ని త్వరలో ఆ సంస్థ ఏర్పాటుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వారి వెంట తహసీల్దార్ గోపాల్, ఇతర అధికారులు ఉన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించండి



సమావేశంలో మాట్లాడుతున్న పాలమాకుల జంగయ్య

మహేశ్వరం: అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్ భూములను పరిరక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎస్‌వీజే కన్వెన్షన్ హాలులో శుక్రవారం పార్టీ 12వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహేశ్వరం, కందుకూరు మండలాల్లో ప్రభుత్వ, అసైన్డ్, భూదాన్ భూములు కబ్జాకు గురవుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. రూ.కోట్ల విలువ చేసే భూములు కొంత మంది కబ్జాదారుల చేతిలో ఉన్నాయని ఆరోపించారు. ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములను బలవంతంగా లాక్కునే ప్రయత్నాలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. మహేశ్వరం మండలంలోని రావిరాల కొంగరఖుర్దు, నాగిరెడ్డిపల్లి, కందుకూరు మండలం అన్నోజిగూడలో ఐటీ, ఎలక్ట్రానిక్ పార్కుల కోసం కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు రైతుల నుంచి బలవంతంగా తీసుకుంటోందని మండిపడ్డారు. అంతకు ముందు ఆయన కార్యకర్తలతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి, రాష్ట్ర కమిటీ సభ్యుడు పానుగంటి పర్వతాలు, నియోజకవర్గ కన్వీనర్ దత్తు నాయక్, మండల కార్యదర్శి పల్నాటి యాదయ్య, కందుకూరు మండల కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలి

ఆర్‌డబ్ల్యూఎస్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్

షాబాద్: ప్రజలకు తాగునీటి ఇక్కట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎన్.శ్రీధర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని అంతారం గ్రామ సమీపంలో ఉన్న మిషన్ భగీరథ ప్లాంట్‌ను శుక్రవారం పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి పరిశీలించారు. నీటిని సక్రమంగా శుద్ధి చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిషన్ భగీరథ తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలంలో ఎక్కడా లీకేజీలు లేకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట మిషన్ భగీరథ ఈఎస్‌సీ కృష్ణాకర్‌రెడ్డి, ఎస్ఈ ఆంజనేయులు, వాటర్ గ్రిడ్ ఈఈ చల్మారెడ్డి, ఇంట్రా ఈఈ రాజేశ్వర్‌రావు, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈలు ప్రపుల్లాకుమార్, గంగ, ప్రియదర్శిని తదితరులు ఉన్నారు.



షాబాద్: మిషన్ భగీరథ తాగునీటి శుద్ధి ప్లాంట్‌ను పరిశీలిస్తున్న శ్రీధర్ తదితరులు

త్వరగా బ్రిడ్జి పనులు పూర్తి చేయాలి

మొయినాబాద్‌రూరల్: మొయినాబాద్–శంకర్‌పల్లి మండలాలను కలుపుతూ చిన్నమంగళారం సమీపంలో ఈసీ వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేసి, ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ అన్నారు. చిన్నమంగళారం సమీపంలో మూసీవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ కనకరత్నం, ఎస్‌ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ శ్రీరాములు, ఏఈ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి తుమ్మల రాక

చేవెళ్ల: మున్సిపల్ పరిధిలోని దేవునిఎర్రవల్లి వార్డు పరిధిలో శనివారం నిర్వహించే పామాయిల్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమానికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రానున్నట్లు రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి మంత్రితోపాటు స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య, పార్టీ జిల్లా, నియోజకవర్గ నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు.

వర్సిటీ ఫుట్‌బాల్ లీగ్ ఫైనల్ మ్యాచ్ నేడు

మొయినాబాద్: నాలుగు నెలలుగా జరుగుతున్న వర్సిటీ ఫుట్‌బాల్ లీగ్ చివరి దశకు చేరుకుంది. మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్‌లో ఉన్న డెక్కన్ ఎరినాలో శనివారం రాత్రి ఫైనల్ మ్యాచ్ జరుగనుంది. హైస్కూల్ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ఈ లీగ్‌లో రాష్ట్రంలోని 60 పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొని మ్యాచ్‌లు ఆడారు. క్వాలిఫైయర్ దశలో 16 జట్లు తలపడగా 8 జట్లు ప్లేఆఫ్‌కు చేరుకున్నాయి. ప్లేఆఫ్‌లో జరిగిన హోరాహోరి పోరులో ది గౌడియం స్కూల్, ఎక్సెలెన్సియా జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. శనివారం రాత్రి 7 గంటలకు డెక్కన్ ఎరినాలో ఫైనల్ మ్యాచ్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ప్రభుత్వ భూమికి రక్షణ

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మొయినాబాద్: ప్రభుత్వ భూములను కబ్జాచేస్తున్న అక్రమార్కులపై రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు. అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసి రూ.30 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడి బోర్డులు ఏర్పాటు చేశారు. మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్ సర్వేనంబర్ 177లో హైదరాబాద్–బీజాపూర్ జతీయ రహదారికి ఆనుకుని ఉన్న రెండు ఎకరాల భూమిని నగరానికి చెందిన అక్రమార్కులు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ గౌతమ్‌కుమార్ వెంటనే అక్రమ నిర్మాణాలను కూల్చివేసి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేశ్‌ను ఆదేశించారు. స్థానిక పోలీసులతో కలిసి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది శుక్రవారం అక్కడికి వెళ్లి జేసీబీ సాయంతో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. భూమిని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు కబ్జాచేసేవారిపై క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఎవరైనా ప్రభుత్వ భూముల జోలికొస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు

బందోబస్తు మధ్య గుడిసె తొలగింపు



మోత్కులగూడలో గుడారాన్ని తొలగిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

మోత్కులగూడలో ఉద్రిక్త పరిస్థితులు

- నదరు స్థలంలోకి ఎవరూ వెళ్లొద్దన్న అధికారులు

నందిగామ: మోత్కులగూడలోని ఓ వివాదాస్పద స్థలంలో ఏర్పాటు చేసిన గుడిసెను గ్రామ కార్యదర్శి చెన్నయ్య శుక్రవారం పోలీసు బందోబస్తు మధ్య తొలగించారు. ఈ నేపథ్యంలో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ స్థలాన్ని గతంలో ప్రభుత్వం మాకే కేటాయించిందని ఒకరు, కాదు మాకే కేటాయించిందని మరొకరు గొడవ పడుతున్నారు. ఇరువురి మధ్య నెలకొన్న ఈవివాదం చినికిచినికి గాలివానలా మారడంతో రాజకీయ రంగు పులుముకుంది. ఈ స్థలంలో ఓ వ్యక్తి ఇటీవల ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం ముగ్గు పోయగా, ఆ స్థలం తమదేనని, తనకు పట్టాతో పాటు, ఏళ్ల తరబడి కబ్జాలో ఉన్నామని మరో వ్యక్తి నిర్మాణాన్ని అడ్డుకున్నాడు. ఇరవై రోజులుగా ఈ పంచాయితీ కొనసాగుతోంది. ఇరువురూ ఒకరిపై ఒకరు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. తనకు పట్టా ఉందని చెబుతున్న వ్యక్తి సదరు స్థలంలో ఇటీవల గుడిసె వేశారు. దీన్ని తొలగించాలని కోరుతూ మరో వ్యక్తి అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో శుక్రవారం గ్రామ కార్యదర్శి చెన్నయ్య స్థానిక పోలీసుల బందోబస్తు మధ్య గుడిసెను తొలగించారు. ఈసమయంలో ఘర్షణ వాతావరణం నెలకొన్నప్పటికీ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ సుమతిని వివరణ కోరగా.. ఇరువురు వ్యక్తులు ప్లాట్లు తమవేనంటున్నారని తెలిపారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన పట్టా సర్టిఫికెట్లు, లే అవుట్ మ్యాప్‌ను పరిశీలించి ప్లాటు ఎవరిదో నిర్ధారిస్తామని, అప్పటివరకు ఎవరూ అందులోకి వెళ్లకూడదని చెప్పామన్నారు.

అప్పులు తీర్చేందుకు చోరీల బాట

- సీసీ కెమెరాలకు చిక్కిన నిందితులు
- అన్నదమ్ములకు రిమాండ్



నరేష్, వెంకటేష్ (ఫైల్)

యాచారం: ప్రైవేట్ ఉద్యోగస్తులైన ఇద్దరు అన్నదమ్ములు అప్పులు తీర్చేందుకు చోరీల బాట పట్టారు. చివరకు సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులకు చిక్కారు. ఈ మేరకు శుక్రవారం వారిని రిమాండ్‌కు తరలించారు. యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామానికి చెందిన నరేశ్, ఇబ్రహీంపట్నం మండలం మంగల్‌పల్లికి చెందిన వెంకటేశ్ వరుసకు అన్నదమ్ములు. ఈ నెల 23న మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లికి చెందిన బండ పార్వతమ్మ నక్కర్తమేడిపల్లిలో బంధువుల ఇంటికి వచ్చి స్వగ్రామానికి వెళ్లే క్రమంలో తక్కళ్లపల్లి గేట్ వద్ద బస్సు ఎక్కేందుకు రోడ్డుపై వేచి యుంది. ఈ క్రమంలో ఆమె ఒంటరిగా ఉందని గమనించిన అనదమ్ము లు హెల్మెట్లు ధరించి బైక్‌వచ్చి పార్వతమ్మ మెడలోంచి మూడు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కెల్లారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించిన పోలీసు లు శుక్రవారం వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. ఈ మేరకు వారి వద్ద నుంచి అపహరించిన పుస్తెలతాడును స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

పీజేఆర్ ఫ్లైఓవర్‌పై.. రయ్ రయ్

నేడు ప్రారంభోత్సవం చేయనున్న సీఎం

- రూ.182.72 కోట్ల వ్యయంతో నిర్మాణం
- 1.2 కి.మీ మేర శిల్పా లేఔట్ ఫేజ్- 2 ఫ్లైఓవర్
- వాహనదారులకు తీరనున్న ట్రాఫిక్ కష్టాలు



ఫ్లైఓవర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ కర్ణన్, ఎమ్మెల్యే గాంధీ తదితరులు



పీజేఆర్ ఫ్లైఓవర్

గచ్చిబౌలి: ట్రాఫిక్ సమస్య తీరడంతో పాటు ఇంధనం, సమయం ఆదా చేయడానికి నిర్మించిన మరో ఫ్లైఓవర్ నేటి నుంచి అందుబాటులోకి రానుంది. పీజేఆర్ ఫ్లైఓవర్ శనివారం సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రారంభించనున్నారు. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే మాదాపూర్ ప్రాంతం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుతో పాటు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతానికి వెళ్లడానికి మార్గం సుగమమవుతుంది. ట్రాఫిక్ కష్టాలు తొలగడానికి ఆస్కారం ఏర్పడుతుంది.

ఫ్లైఓవర్ విశిష్టతలు..

- ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, మాదాపూర్, శంషాబాద్ వెళ్లేందుకు ట్రాఫిక్ కష్టాలు ఉండవు.
- శిల్పా లేఔట్ ఫేజ్–2 ఫ్లైఓవర్ కాగా.. దీనికి పీజేఆర్ ఫ్లైఓవర్‌గా నామకరణం చేశారు
- ప్రాజెక్టు మొత్తం వ్యయం 446.13 కోట్ల అంచనా
- ఇందులో ఫేజ్–2 ఫ్లైఓవర్ పూర్తి అంచనా వ్యయం రూ.182.72 కోట్లు
- ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్ రోడ్డు వరకు 630 మీటర్లు
- ఆబ్లిగేటరీ స్పాన్ (స్టీల్) 450 మీటర్లు
- త్రీ లేన్, వెడల్పు 24 మీటర్లు
- క్యారెట్ వే 6 లైన్ల బై డైవర్షనల్
- కొండాపూర్ వైపు డౌన్ ర్యాంప్ రెండు వైపులా 165 మీటర్లు
- వెడల్పు 12 మీటర్లు
- ఆరు లేన్ల ఫ్లైఓవర్‌గా నిర్మాణం

ఉపయోగాలు ఇలా..

- మెహిదీపట్నం, మాదాపూర్, జూబ్లీహిల్స్ వైపు నుంచి వచ్చే వాహనాలతో గచ్చిబౌలి జంక్షన్ వద్ద భారీ ట్రాఫిక్ జామ్‌కు ఉపశమనం
- ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్ వైపు వాహనాలు అంతరాయం లేకుండా వెళ్లొచ్చు
- ఉదయం, సాయంత్రం వేళల్లో హైటెక్‌సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మధ్య మెరుగైన కనెక్టివిటీ
- గచ్చిబౌలి జంక్షన్ వద్ద పీక్ అవర్‌లో దాదాపు 10.5 నిమిషాలు ఆదా
- ట్రిపుల్ ఐటీ జంక్షన్ నుంచి గచ్చిబౌలి జంక్షన్, సైబరాబాద్ నుంచి గచ్చిబౌలి జంక్షన్‌లకు వేగంగా చేరుకునే వీలు గణనీయమైన ఇంధన ఆదా

ఫ్లైఓవర్ పరిశీలన..

శుక్రవారం పీజేఆర్ ఫ్లైఓవర్‌ను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, అధికారులతో కలిసి పరిశీలించారు. వీరి వెంట వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ హేమంత్ సహదేవ్‌రావు, ప్రాజెక్ట్ సీఈ భాస్కర్‌రెడ్డి, ఎస్ఈ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, డిప్యూటీ ఈఈ, ఇతర అధికారులు ఉన్నారు.

సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు..

శిల్పా లేఅవుట్ రెండో దశ ఫ్లై ఓవర్‌కు దివంగత నేత పి.జనార్దన్ రెడ్డి పేరు పెడుతున్నట్లు జీఓ విడుదల చేయడంతో ఆయన సతీమణి సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రేవంత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవానికి వచ్చి సీఎం, మంత్రులకు నేరుగా కృతజ్ఞతలు చెప్పాలని ఉందని, ఆరోగ్యం సహకరించకపోవడంతో రాలేకపోతున్నానని ఆమె తెలిపారు.

మరో ప్రాజెక్టు అందుబాటులోకి రావడం ఆనందకరం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సాక్షి, సిటీబ్యూరో: వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం (ఎస్సార్‌డీపీ) కింద మరో ప్రాజెక్ట్ అందుబాటులోకి రానుండటం సంతోషంగా, గర్వంగానూ ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. శనివారం పీజేఆర్ (శిల్పా లే ఔట్ ఫేజ్–2) ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని ఎక్స్ వేదికగా ఫ్లై ఓవర్ వీడియోను శుక్రవారం ఆయన షేర్ చేశారు. ఎస్సార్‌డీపీలోని 42 ప్రాజెక్టుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం 36 ప్రాజెక్టులను పూర్తి చేసిందని గుర్తు చేశారు.

గోదాం పైనుంచి పడి కూలీ మృతి

హయత్‌నగర్: రేకుల షెడ్డు పైకప్పు నుంచి కింద పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన హయత్‌నగర్ పోలీస్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీ కొహెడకు చెందిన పొట్లచెరువు మల్లేశ్(55) తోటి కార్మికులతో కలిసి శుక్రవారం ఉదయం స్థానికంగా ఉన్న ఓ విత్తనాల కంపెనీ గోదాం పైకప్పు రేకులను మార్చే పని చేస్తున్నారు. మధ్యాహ్నం సమయంలో ప్రమాదవశాత్తు పైనుంచి కింద పడ్డాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయమైంది. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం: బిహార్ రాష్ట్రానికి చెందిన యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన శుక్రవారం సాయంత్రం ఇబ్రహీంపట్నంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన వివేక్(23) ఇదే రాష్ట్రానికి చెందిన కాంచన అనే అమ్మాయిని ఐదు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. అనంతరం ఇబ్రహీంపట్నానికి వచ్చి ప్రగతినగర్‌లో నివాసముంటూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వారం రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన వివేక్ భార్య బయటకు వెళ్లిన సమయంలో, వెంటిలెటర్‌కు చీర కట్టి ఉరేసుకుని, ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య వచ్చి తలుపులు తీసి చూడగా చలనం లేకుండా కనిపించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

హుండీ చోరీకి విఫలయత్నం



హుండీ చుట్టూ సిమెంట్ తవ్విన ఆనవాళ్లు

ఇబ్రహీంపట్నం: గుర్తు తెలియని దుండగులు దర్గాలో హుండీ చోరీకి విఫలయత్నం చేశారు. ఈ ఘటన ఇబ్రహీంపట్నం ఠాణా పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. చర్లపటేల్‌గూడకు వెళ్లే మార్గంలోని జహంగీర్‌పీర్ దర్గా వద్ద హుండీని భూమిలోకి ఉంచి చుట్టూ సిమెంట్‌తో ఏర్పాటు చేశారు. ఈ హుండీని పెకిలించేందుకు గుర్తు తెలియని దుండుగుల చుట్టూ ఉన్న సిమెంట్ తవ్వారు. ప్రయత్నం విఫలమవడంతో మధ్యలోనే వదిలి వెళ్లారు. దుండగుల ఆచూకీకి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

టీ జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదం

ద్విచక్ర వాహనదారుడికి తీవ్రగాయాలు

ఇబ్రహీంపట్నం రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన ప్రకారం.. యాచారం మండలం గడ్డమల్లయ్యగూడకు చెందిన దార మహేందర్ బైక్‌పై వండల్ లా జంక్షన్ నుంచి కొంగరకలాన్‌వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లే టీ జంక్షన్ వద్ద ముందు వెళ్తున్న కాంక్రీట్ మిక్సర్ లారీ ఒక్కసారిగా కుడివైపునకు మలుపు తిప్పాడు. దీంతో వెనుకాల వస్తున్న బైక్ లారీ ఢీ కొట్టడంతో ద్విచక్రవాహనదారుడు కిందపడిపోయి తలకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అడుక్కోవద్దు!

మరోసారి బెగ్గర్ ఫ్రీ సిటీ!!

- గతంలో విఫలం
- ఇప్పుడు మళ్లీ ప్రారంభం
- చర్యలు చేపట్టిన జీహెచ్ఎంసీ
- మూడ్రోజులుగా ముమ్మరం



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో మరోసారి బెగ్గర్ ఫ్రీ సిటీ కార్యక్రమానికి జీహెచ్ఎంసీ సిద్ధమైంది. నగరంలోని పలు ప్రధాన కూడళ్లలో ఇబ్బందులు కలిగిస్తున్న యాచకులను గుర్తించి షెల్టర్ హోంలకు లేదా సంబంధిత కుటుంబ సభ్యులకు అప్పగించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు బల్దియా ప్రకటించింది. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలమేరకు ఇప్పటికే అన్ని సర్కిళ్లలో.. ప్రధానంగా బషీర్ బాగ్, సెక్రటేరియట్, నాంపల్లి, బేగంబజార్ తదితర ప్రాంతాల్లోని జంక్షన్లలోని యాచకులు, ఫుట్‌పాత్‌లపై ఉండేవారిని గుర్తించి జీహెచ్ఎంసీ షెల్టర్ హోంలకు తరలిస్తున్నారు. మిగిలిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చి వారిని తమ సొంత ఊళ్లకు, నివాసాలకు పంపిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని జీహెచ్ఎంసీ అర్బన్ కమ్యూనిటీ విభాగం ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ప్రధాన కూడళ్లు, మతపరమైన ప్రదేశాలలో భిక్షాటన చేసే వారి గురించి సమాచారం అందుకొని, వారిని వైద్య పరీక్షల తర్వాత పోలీసుల సహకారంతో జీహెచ్ఎంసీ షెల్టర్ హోంలకు తరలిస్తున్నారు.

221 మంది గుర్తింపు..

ఇప్పటి వరకు 221 మందిని గుర్తించారు. వీరిలో 173 మంది పురుషులు, 37 మంది మహిళలు, 11 మంది చిన్నారులు ఉన్నారు. వీరిలో 19 మందిని జీహెచ్ఎంసీ నిర్వహిస్తున్న షెల్టర్ హోంలకు తరలించగా, మిగిలిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించి వారివారి కుటుంబ సభ్యుల వద్దకు పంపించారు. యాచకులు, ఫుట్ పాత్‌లపై ఉండేవారిని షెల్టర్ హోంలకు లేదా వారి కుటుంబ సభ్యుల వద్దకు తరలించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని జీహెచ్ఎంసీ యూసీడీ అధికారులు తెలిపారు.

ఈ ప్రాంతాల్లో ఎక్కువగా..

తాజాగా నాంపల్లి మెట్రోస్టేషన్, ఎస్సార్‌నగర్ మెట్రో జంక్షన్, శిల్పారామం, హైటెక్ సిటీ, మాదాపూర్ ప్రాంతాల్లో ఎక్కువమందిని గుర్తించారు.

సాగేనా.. ఆగేనా?

నగరాన్ని బెగ్గర్ ఫ్రీ చేయడమనేది ప్రహసనంగా మారింది. గతంలోనూ ప్రయత్నాలు చేసినా మూణ్నాళ్ల ముచ్చటగా మిగిలింది. వాటిని ఒకసారి పరిశీలిస్తే.. 2017 నవంబర్‌లో అమెరికా అధ్యక్షుడిగా ఉన్న (ప్రస్తుతం సైతం ఆయనే) డొనాల్డ్ ట్రంప్ కుమార్తె నగరానికి వచ్చే ముందు యాచకులు లేకుండా చేశారు. ముమ్మందు బిచ్చగాళ్లు అనేవాళ్లు లేకుండా చేస్తామని ప్రకటించి కొన్ని నెలల వరకు కొనసాగించారు. ఎల్‌బీనగర్, ఉప్పల్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో యాచన చేస్తున్న వారిని నగర శివార్లలోని చౌటుప్పల్‌లోని అమ్మానాన్న అనాథాశ్రమానికి తరలించారు. ఈ వృత్తిని నిర్మూలిస్తామని అప్పటి మేయర్ బొంతు రామ్మోహన్ సైతం ప్రకటించారు. వారిలో చాలామంది ఫేక్ అని, దాదాపు మూడువేల మంది పసిపిల్లలతో దందా నడిపిస్తున్నారని, దాన్ని అరికడతామన్నారు. నిజంగా యాచన తప్ప ఏపనీ చేయలేని అసహాయులను అన్నివిధాలా ఆదుకుంటామని, పనిచేసే శక్తి ఉన్నవారికి అవసరమైన వారికి తగిన శిక్షణ నిప్పించి ఉపాధి కల్పిస్తామన్నారు. కానీ.. అమలు కాలేదు. ఇప్పుడు మరోసారి బెగ్గర్ ఫ్రీ నగరంగా మార్చేందుకు చర్యలు ప్రారంభించారు. ఏమవుతుందో కొన్నాళ్లయితే కానీ తెలియదు.

నకిలీలే అధికం..

గ్రేటర్‌లో ఇరవైవేల మందికి పైగా ఈ వృత్తిలో ఉండగా, వీరిలో కేవలం పదిశాతం మాత్రమే నిజంగా అశక్తులు. బిహార్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన యువకులు కూడా వీరిలో ఉన్నారు. జంక్షన్లు, ప్రార్థనా మందిరాలు, ట్రాఫిక్ సిగ్నళ్లు వీరి అడ్డాలు. వీరిలో చాలామందికి మద్యం, ఇతరత్రా మత్తుపదార్థాల వ్యసనం ఉంది. ఈ ఊబిలో బందీలుగా ఉన్న బాలలు రోజుకు సగటున రూ. 500 వరకు ఆర్జిస్తున్నారు. ఈ పని చేస్తున్న మహిళల్లో కొందరు పగటి పూట యాచన చేస్తూ, రాత్రి వేళల్లో సెక్స్ వర్కర్లుగా మారుతున్నారు. యాచకుల్లో 90 శాతానికి పైగా పునరావాసం కల్పిస్తామన్నా, వృద్ధాశ్రమాలు/విద్యాసంస్థలు/ ఆశ్రమాలు/ అనాథ శరణాలయాల్లో చేరుస్తామన్నా నిరాకరిస్తున్నట్లు వివిధ సర్వేల్లో వెల్లడైంది.

రూ. 300 కోట్లకు పైగా సంపాదన

వివిధ సర్వేల మేరకు నగరంలోని యాచకులు ఏటా రూ. 300 కోట్లకు పైగా సంపాదిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాల స్థలంలో ఇళ్ల నిర్మాణం

కూల్చివేయించిన రెవెన్యూ అధికారులు



అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయిస్తున్న అధికారులు

చేవెళ్ల: ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య హెచ్చరించారు. నాంచేరి రెవెన్యూ పరిధిలోని ఇంద్రారెడ్డి నగర్‌లో ప్రభుత్వ పాఠశాలకు కేటాయించిన స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న ఏడు ఇళ్లను శుక్రవారం పోలీసుల సహకారంతో రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ఇంద్రారెడ్డి నగర్‌లో ప్రభుత్వ పాఠశాలకు సర్కార్ 2.20 ఎకరాల స్థలం కేటాయించింది. ఇక్కడ ప్రస్తుతం ప్రాథమిక పాఠశాల కొనసాగుతోంది. చుట్టూ ఖాళీ స్థలం ఉండడంతో ఏడుగురు స్థానికులు ఆక్రమించి ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ కృష్ణయ్య, ఆర్ఐలు చంద్రమోహన్, పవన్, సీఐ భూపాల్ శ్రీధర్, ఎస్ఐ సంతోష్‌కుమార్ వెళ్లి నిర్మాణాలను కూల్చివేశారు. ఈ కూల్చివేతల్లో రెవెన్యూ సిబ్బంది నర్సింలు, ప్రకాశ్, ఆంజనేయులు, రవీందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ నిర్మాణాల్లో అధికార పార్టీకి చెందిన నాయకుడి కుమారుడి ఇళ్లు ఉండడం విశేషం.

వీధి కుక్క స్వైర విహారం



వీధికుక్క దాడిలో గాయపడిన హర్షవర్ధన్

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం వాచ్యతండా గ్రామపంచాయతీ దేవులనాయక్‌తండాలో శుక్రవారం వీధికుక్క స్వైర్య విహారం చేసింది. తండాకు చెందిన ముగ్గురు వ్యక్తులపై దాడిచేసి, గాయపరిచింది. మేకలు, కోళ్ల వెంటపడుతున్న కుక్కను నేనావత్ చందర్, సబావత్ సక్రీబాయ్ అదిలించే ప్రయత్నం చేయగా వారిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచిందని స్థానికులు తెలిపారు. పక్కనే ఉన్న ముడావత్ హర్షవర్ధన్(5)పై దాడిచేసి గాయపరిచిందని పేర్కొన్నారు. కుక్కల దాడిలో గాయపడిన వారిని చికిత్స కోసం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు.

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి

కుల్కచర్ల ఎస్ఐ రమేశ్

కుల్కచర్ల: దుకాణదారులు ప్రతీ ఒక్కరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కుల్కచర్ల ఎస్ఐ రమేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా వంద కెమెరాలతో సమానమన్నారు. రోడ్డు ప్రమాదాలు, చోరీలు జరిగిన సమయంలో నిందుతులను సులువుగా పట్టుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.